# కొడుకు మనసు

భగవత్



ఉదయం తొమ్మిదిన్నర సమయంలో... ఆ ఇంటి ఇల్లాలు భద్రకాళిలా చిందులేస్తుంటే ఆ ఇంటి యజమాని పిల్లలతోసహా ఓ మూల నిలుచుని దిక్కులు చూస్తున్నాడు. మరోమూల ఓ ముసలి బిక్కప్రాణం బిక్కుబిక్కుమంటూ చూస్తుంది.

''ఇదుగో చివరిసారిగా చెప్తున్నాను. ఇక ఊరుకునేది లేదు. ఆ వెధవ చూపులు మాని, మీకు నేనెక్కువో? మీ అమ్మ ఎక్కువో తేల్చుకోండి. అది మీకు తల్లయితే కావచ్చు. కాని నాకేం కాదు. దానికి నేను అరవ చాకిరీ చేయలేను. నా పిల్లలు దానిదగ్గరకు వెళ్ళడం అసలు సహించలేను. అర్థమవుతుందా? తల్లి అని ప్రేమ కారిపోతుంటే దాన్నెక్కడో పడేసి నెలకింతని డబ్బు పారెయ్యండి'' ఇంటి ఇల్లాలి కంచు కంఠం మారుమ్రోగిపోతూంది. అతను మెల్లగా నోరు విప్పాడు.

''అది కాదు సుశీ! అమ్మకు నేను తప్ప వేరు సంతానం లేదు. ఎక్కడికని పోతుంది చెప్పు?''

గయ్‌మంది ఇల్లాలు. ''అదంతా నాకనవసరం. నా ఇంట్లో మాత్రం అది ఉండటానికి వీల్లేదంటే లేదు. ఇలాంటి ముసలాళ్ళ కోసం ఏవో అనాథ శరణాలయాలుంటాయట కదా! అందులో పారేసి నెలకింతని పారెయ్యండి. పీడ వదిలిపోతుంది.''

కోడలు అలా చెలరేగుతుంటే, వృద్ధురాలైన అత్తగారు నిస్సహాయంగా నిలబడి కళ్ళనీరు కుక్కుకుంటూ, దిక్కులు చూస్తున్న కన్నకొడుకు కేసి చూసింది. అతను నెమ్మదిగా నోరువిప్పి నచ్చచెబుతున్నట్టు అన్నాడు. ''అదే నీ తల్లి అయితే ఇలాగే దిక్కులేనిదానిలా వదిలేస్తావా?''

ఆ మాటకు సుశీల ఒంటికాలిమీద లేచింది. ''హు! అంత ఖర్మ మా అమ్మకేం పట్టిందని? హాయిగా కాలుమీద కాలేసుకుని తినగలిగినంత ఆస్తి వుంది. నీడకో ఇల్లుంది. ఇలా ఒకరిమీద పడి దేబిరించుకుని తినాల్సినంత అవసరం ఆమెకేమిటి?''

ఇంకేమయినా అంటే నాలుగిళ్ళు వినేట్టుగా యాగీ చేస్తుందని అతనికి అనుభవ పూర్వకంగా తెలుసు. అందుకని ఆమె నోటికి భయపడి ''అలాగేలేవే'' అనేసి, తల్లివైపు చూడలేక అటువైపు తిరిగి గోడకేసి చూస్తూ ''నీ బట్టలూ అవీ సర్దుకో. సాయంత్రం వెళ్దాం'' అంటూ గబగబా బయటకు నడిచాడు. కన్నకొడుకు మాట తుపాకి తూటాలా తగిలింది కాబోలు, వృద్ధురాలి గుండె గుభేలుమంది. ధారాపాతంగా కారిపోతున్న కన్నీళ్ళను కూడా తుడుచుకోవడం మరిచి బేలగా జాలిగా చూసింది కోడలికేసి. మూతి మూడు వంకలు తిప్పుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది కోడలు.

• • •

వృద్ధుల అనాథాశ్రమం ఎక్కడుందో ఓ మిత్రుని అడిగి తెలుసుకుని, అక్కడికి వెళ్ళి మరిన్ని వివరాలు తెలుసుకోవాలని, వెళ్ళి బస్టాపులో నిలుచున్నాడు.

తీవ్రమైన వేసవి ఎండ మండిపోతుంది. బస్సు కోసం పడిగాపులు పడుతూ క్యూలో నిలుచున్నవారందరికీ కాస్త ఎడంగా పోయి నిలుచుని సిగరెట్ ముట్టించాడు. అతని మనసు వికలమయి మెదడు మొద్దుబారినట్టుంది.

''బాబూ ధర్మం!''

అతని ఆలోచనలు ఆగిపోయాయి. జీవం లేని చూపులతో ఎదురుగా చూసాడు. ముష్టిది! నల్లగా జిడ్డోడుతున్న మొహంతో, పీక్కుపోయిన దవడలు, లోతుకుపోయిన కళ్ళతో ఎముకల పోగులా వుంది. ఆమె చంకలో పసివాడు బోసి నవ్వుల్తో. ఆమె వొంటిమీదున్న చిరుగుల చీర తన శరీరాన్ని దాచలేకపోతున్నా పిల్లాడికి ఎండ తగలకుండా చిరుగుల చెంగును వాడి తలమీద కప్పింది.

ఆమె మీదనుంచి చూపులు తిప్పుకుని 'పొమ్మ'న్నట్టు చేయి ఆడించాడు. అది కదలలేదు. మరింత దీనంగా దోసిలి చాపుతూ 'ధర్మం చేయి బాబూ! పసికూన అల్లాడిపోతున్నాడు'' అంది.

విసుక్కుంటూ జేబులోంచి పదిపైసల బిళ్ళతీసి పడేసాడు.

''భగమంతుడు సల్లగా సూడాలి'' అంటూ అక్కణ్ణుంచి కదిలింది. అటే చూస్తున్నాడతను. ఇచ్చినవారు ఇస్తున్నారు. ఇవ్వనివారు పోపొమ్మని కసురుతున్నారు. పావుగంట గడిచాక అది ఆ పక్కనే ఉన్న ఐసుబండి దగ్గర కెళ్ళి, ఓ ఐసుఫ్రూటు కొని పిల్లాడికి అందించి, నిట్టూరుస్తూ ఓ మూల నీడలో నిలుచుంది. పిల్లాడు ఐసుఫ్రూట్ చప్పరిస్తూ మహదానందంతో కేరింతలు కొడుతుంటే అది చూస్తున్న ఆమె కళ్ళలో సంతృప్తితో కూడిన వింత వెలుగులు విరజిమ్మసాగాయి. అటువేపే పరిశీలనగా చూస్తున్న అతని మనసులో ఏదో ముల్లు గుచ్చుకున్నట్టయింది. అలాంటి వింత వెలుగులూ, సంతృప్తి వెదజల్లే కాంతి పుంజాలు తన పసితనంలో అమ్మ కళ్ళల్లో కూడా చూసేవాడు.

తనకు ఇంకా జ్ఞాపకం వుంది. ఊహ తెలుస్తుండగానే తండ్రి పోయాడు. చిల్లిగవ్వ ఆస్తి లేని తల్లి. నా అనేవాళ్ళు లేక బ్రతుకు వీధిన పడి, ఎన్నో కష్టాలకోర్చి, తను మనిషిగా మలిచింది. తను స్కూల్ ఫైనల్ పూర్తిచేసేటప్పటికి ఆమె రూపు మారిపోయింది. అందమయిన ఆరోగ్యమయిన శరీరం శిథిలమయి, అకాల వార్ధక్యం ముంచుకొచ్చి వంగిపోయింది.

ఆ తల్లే గనక తన బాగు, తన సుఖం, తన సంతోషం తను చూసుకుని వుంటే, ఈనాడు తను ఎలా ఉండేవాడో ఊహించుకోటానికే భయంగా వుంది. కన్నకొడుకు సుఖ సంతోషాల కోసం, ఉన్నతి కోసం ఆ మాతృమూర్తి ఎంతో త్యాగం చేసింది. తనని ఇంతవాడ్ని చేసి [illegible] రాలనుకుంటున్న సమయంలో ఆ త్యాగమూర్తికి తను ఏం చేయాలనుకుంటున్నాడు? ఎక్కడో ఓల్డేజ్ హోమ్‌లో పడేస్తే తన రుణం తీరిపోతుందా? ఆమె కడుపులోకి నాలుగు మెతుకులు వెళితే సరా? ఈ వృద్ధాప్యంలో, బీటలు వారిన ఆమె మనసుపై ఆదరాభిమానాలు, ఆప్యాయతల పన్నీటి జల్లులు ఎవరు చిలకరిస్తారు?

బస్సు హారన్‌కు ఉలిక్కిపడి ఆలోచనల నుండి తేరుకుని చూసాడు. అదే తను ఎక్కవలసిన బస్సు! బస్సు కదిలింది. కానీ అతను ఒక అడుగు కూడా ముందుకు కదపలేదు. చెమ్మగిల్లిన కళ్ళకు మసగ్గా కనిపిస్తున్న బస్సును చూస్తూ ఉండిపోయాడు.

• • •

ఎండలో మాడిపోయిన ముఖంతో నిస్తేజంగా లోపలికి వస్తున్న మొగుడికి ఎదురెళ్ళి అడిగింది సుశీల. ''ఆగండాగండి. వెళ్ళిన పనేం చేసుకొచ్చారు? అనాథ శరణాలయం ఎక్కడుందో తెలుసుకొచ్చారా లేదా? ఆవిడ మూటా ముల్లె సర్దుకుని కూచుంది. ఇక మీదే ఆలస్యం. ఎంత త్వరగా ఈ పీడ..'' ఆమె మాట పూర్తికాలేదు. ఆమె ఊహించని రీతిలో 'ఫట్'మని ఆమె దవడ పేలిపోయింది. ఒక్కక్షణం ఆమె చూపులో ఊహకందని అయోమయం! ఆ దెబ్బకు తేరుకోకముందే ఆమె చెంపలు బూరెల్లా పొంగాయి.

''ఒసేయ్ రాక్షసీ.. ఊరుకున్నకొద్దీ నెత్తికెక్కుతున్నాయి కళ్ళు. నా తల్లి.. నాకోసం అష్టకష్టాలు పడి పెంచిన తల్లిని ఎక్కడికి పంపెయ్యమంటావే? ఎక్కడికీ వెళ్ళదు. నా తల్లి ఇక్కడే మహారాణిలా వుంటుంది! నీకిష్టమయితే వుండు. లేదా బయటకి నడు.''

''ఏమిటండీ..''

''షటప్.. మరోమాట బయటికి వస్తే, మెడ పట్టి గెంటేస్తాను. ఎక్కడికి పోతావో పో'' జేబులోంచి డబ్బుతీసి ఆమె ముఖాన కొట్టాడు. ఊహించని అతని రౌద్రాకారాన్ని భయంగా చూస్తూ వెక్కుతూ అక్కడే చతికిలబడిపోయింది సుశీల దిక్కుతోచని దానిలా!

అతను పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ తనకేసి విస్మయంగా విస్ఫారిత నేత్రాలతో చూస్తున్న తల్లి దగ్గరకు చేరుకుని ఆమె ఎదుట మోకాలిపై కూచుని, ఆమె కళ్ళల్లోకి చూసాడు ఆర్తిగా.. ఆ మాతృమూర్తి కళ్ళల్లో ప్రతిఫలించే చల్లని వెలుగుల కోసం!

★